క్లుప్తంగా

8 నుంచి సరస్వతీదేవి విగ్రహప్రతిష్ఠ



మరికల్: మండల కేంద్రంలోని రాయచూర్ రోడ్డుకు నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈ నెల 8 నుంచి సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సోమవారం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 8 నుంచి 10 వరకు విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందన్నారు. అన్ని హంగులతో ఆలయం ముస్తాబు చేసినట్లు తెలిపారు. అధికసంఖ్యలో గ్రామస్తులు పాల్గొని ఉత్సవాలు జయప్రదం చేయాలని వారు కోరారు.

మహిళా డాక్టర్లకు సన్మానం



మక్తల్: జాతీయ మహిళా డాక్టర్ల దినోత్సవం సందర్భంగా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు గోపాలం ఆధ్వర్యంలో మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళా వైద్యులు నవీన, నాసర్‌లను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది యాదగిరి, రఘు, సుధాకర్, శ్రీనివాసులు, సిద్ధిలింగయ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత

మరికల్: మేత మేసుకుంటూ వెళ్లి విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృత్యువాత పడిన సంఘటన మండలంలోని మాధ్వార్‌లో శనివారం చోటుచేసుకుది. బాధితుడి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన లక్ష్మయ్య తన రెండు ఎద్దులను సోమవారం మేతకు తీసుకెళ్లాడు. అందుల్లో ఒకటి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలకు తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడింది. ఈ విషయంపై వెంటనే లైన్‌మెన్‌కు సమాచారం ఇవ్వగా, ఆయన పంచనామా చేశారు. బాధిత రైతును ట్రాన్స్‌కో శాఖ తరఫున ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

'లక్ష డప్పులు-వేల గొంతుకలు' పోస్టర్ విడుదల

ధన్వాడ: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం 'లక్ష డప్పులు వేల గొంతుకలు' పోస్టర్‌ను సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు విడుదల చేశారు. ఈ నెల 7న చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షులు రాజన్న, గౌరవ అధ్యక్షులు చింతన్ పువ్వు నర్సింహులు, ఉపాధ్యక్షులు శంకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్ క్యాలెండర్ ఆవిష్కరణ

కొత్తపల్లి: మండల కేంద్రంలో లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు శంకరయ్య మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా ఉండాలని, ప్రజాస్వామ్యంలో మన వీరశైవ లింగాయత్‌ల పాత్ర ప్రత్యేకంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో లింగాయత్ అధ్యక్షులు నాగభూషణం, ప్రధాన కార్యదర్శి గంగాధర్, రాజు, వినోద్, వీరన్న, కుమారస్వామి, శివరాజు, శ్రీశైలం పాల్గొన్నారు.

ఆలయ గోపురం నిర్మాణానికి విరాళం

నారాయణపేట రూరల్: మండలంలోని బొమ్మన్నాడు గ్రామ ఆంజనేయస్వామి దేవాలయం గోపుర నిర్మాణానికి కమిటీ సభ్యులు విరాళాలను సేకరిస్తున్నారు. ఈ క్రమంలో పేరపల్ల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రామకృష్ణ తల్లిదండ్రుల చేతులమీదుగా రూ.లక్ష పదహారు వేలు విరాళం అందజేశారు.

గెలుపోటములు సమానం

దామరగిద్ద: క్రీడల్లో గెలుపోటములను సమానంగా భావించాలని మాజీ సర్పంచ్ వన్నాడ ఆశమ్మఅంజప్ప, వన్నాడ చంద్రకాంత్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని హిందూనగర్ యూత్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతలకు బహుమతుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని కలెక్టర్‌కు వినతి

దామరగిద్ద: మండలంలోని ఉల్లిగుండం, అన్నాసాగర్ నర్సాపూర్ గ్రామాల బీటీ రోడ్డును పునఃనిర్మాణం చేపట్టాలని సోమవారం ఆయా గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన బీటీ రోడ్డు మరమ్మతులకు నోచుకోక గుంతలు పడి, కోతకు గురైందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కిషన్‌రావ్, సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ తిరుపతి, దామోదర్‌రెడ్డి, మోహన్‌రాజ్, కొండప్ప, మల్లేష్, వెంకటయ్య, మహేష్ పాల్గొన్నారు.

మహిళా సంఘాల సొమ్ము స్వాహా



ధన్వాడ మానికేశ్వరి మహిళా సంఘం సభ్యులు



కిష్టాపూర్‌లో ఏపీఎం హన్మంతుతో వాగ్వాదం చేస్తున్న మణికంఠ మహిళా సంఘం సభ్యులు

- వీఓఏ చేతిలో మోసపోతున్న మహిళా సంఘాలు
- డబ్బులు కట్టినా.. బ్యాంకు నుంచి నోటీసులు
- ఇళ్లకు తాళం వేస్తామని ఐకేపీ అధికారుల బెదిరింపులు

ధన్వాడ: మహిళా సంఘాల సభ్యులు కష్టపడి పని చేసి, వచ్చిన డబ్బును పొదుపు చేస్తూ పొదుపుగా వాడుకుంటారు. ఐకేపీలో తక్కువ శాతం వడ్డీతో ప్రభుత్వం లోన్ ఇస్తుందని, వాటిని తీసుకోని ప్రతి నెల కరెక్టుగా తిరిగి కడుతుంటే మధ్యలో వీఓఏలు వాటిని స్వాహా చేస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు వీఓఏలను అడగకుండా మహిళా సంఘాలపై వత్తిడి తీసుకొస్తున్నారు. వాటికి వడ్డీ చక్ర వడ్డీ వేస్తూ తిరిగి కట్టాలని, లేకుంటే కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. మండల కేంద్రంలోని మానికేశ్వరి మహిళా సంఘం 26 నవంబర్ 2018లో ఇద్దరు మహిళలు రూ.50 వేలు, 5 మంది మహిళలు రూ.25 వేల చొప్పున రూ.2.50లక్షలను శ్రీనిధి కింద వడ్డీకి తీసుకున్నారు. ఇందుకు గాను ప్రతినెల బ్యాంకులో కట్టుకుంటు వస్తున్నారు. ఐకేపీ సిబ్బంది వారిని బ్యాంకులో కట్టొద్దని, తమకు లెక్క సరిగా రావడం లేదని తెలిపారు. ఐకేపీ వీఓఏల వద్ద డబ్బు కట్టాలని వారికి చెప్పడంతో అప్పటి నుంచి వీఓఏ బాలరాంకు డబ్బులు కడుతూ వచ్చారు. ఇలా రెండేళ్లుగా వీఓఏకు డబ్బులు కట్టారు. వారు కట్టాల్సిన ఈఎంఐ 20 జూన్ 2022లో పూర్తి అయింది. కొత్తగా లోన్ కోసం వెళ్లగా ఐకేపీ సిబ్బంది మీరు లోన్ పూర్తి స్థాయిలో కట్టలేదని, ఇంక రెండేళ్ల చెందిన రూ.50వేలు కట్టాలని చెప్పడంతో మహిళలు ఆశ్చర్యపోయి వారు కట్టిన రశీదులు అధికారుల ముందు ఉంచారు. అందులో బ్యాంకులో కట్టిన రశీదుల వరకు క్లియర్‌గా ఉన్నాయి. వీఓఏతో కట్టిన డబ్బులు బ్యాంకులో జమ కలేదని తెలింది. అప్పటికే వీఓఏ మోసం చేశాడని అధికారులు ఆతనిపై కేసు నమోదు చేశారు. వారు కట్టాల్సిన రూ.50వేలు, వడ్డీ, చక్రవడ్డీ కలిపి రూ.87వేలు కట్టాలని సూచించారు. ఇప్పుడు వీఓఏ మోసం చేసిన డబ్బులు కట్టాలని మహిళా సంఘాలపై ఐకేపీ సిబ్బంది వత్తిడి తెస్తున్నారు. వారికి కొత్త రుణాలు ఇవ్వడంలేదని, మహిళా సంఘాన్ని రద్దు చేసుకునేందుకు తీర్మానం చేసుకున్నారు.

రూ.10 లక్షలకు పైగా..

మండలంలో దాదాపు రూ.10 లక్షలకు పైగా వీఓఏలు మోసాలు చేశారు. ఇది జరిగి నాలుగేళ్లు అవుతున్నా అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వీఓఏలపై కేసు నమోదు చేసిన వారు బెయిలుపై వచ్చి తిరిగి పనులు చేసుకుంటున్నారు.

డబ్బులు కట్టిన వారికి నోటీసులు

మండలంలోని కిష్టాపూర్‌లో మనికంఠ మహిళా సంఘం సభ్యులు శ్రీనిధికి చెందిన డబ్బులు ఇద్దరు మహిళలు రూ.50వేల చొప్పున తీసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. వారికి 2018, మే 2న మంజూరు చేసి సంఘం ఖాతాలో డబ్బు జమచేశారు. ఐతే మరో ఇద్దరు తమకు డబ్బు కావాలని చెప్పడంతో పంచుకుంటే తక్కువ వస్తుందని ఎవరూ డబ్బు తీసుకోలేదు. వచ్చిన డబ్బులు ఖాతాలోనే ఉండిపోయాయి. డబ్బులను తీసుకోకపోతే వాటిని తిరిగి శ్రీనిధికి జమ చేయాలని చెప్పడంతో వడ్డీతో పాటు 2019 జనవరి 22న శ్రీనిధి ఖాతాకు రూ.1,23,700 జమ చేశారు. ఆ డబ్బు ఇంకా కట్టలేదని 29న అధికారులు నోటీసులు జారీ చేశారు. తాము డబ్బులు అప్పుడే కట్టేశామని చెప్పినా, తమకు ఆ డబ్బులు రాలేదని పేర్కొన్నారు. వీరు కట్టిన డబ్బులు వేరే సంఘాలకు అడ్జస్ట్‌మెంట్ చేశారని చెప్పడంతో సంఘం సభ్యులు లబోదిబోమంటున్నారు. అధికారులు చేసిన తప్పుకు తమను బలిచేసేందుకు చుస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల సంఘం సభ్యులతో కలిసి మహిళా సంఘానికి వచ్చిన సభ్యులకు ఏపీఎం హన్మంతు డబ్బులు కట్టాల్సిందేనని తేల్చిచెప్పడంతో, అంత డబ్బు కట్టలేమని వాపోయారు.



ధన్వాడ మానికేశ్వరి మహిళా సంఘం సభ్యులు కట్టిన రశీదులు

రూ.25 వేలు తీసుకున్నారు..



నేను 2018లో రూ.25వేలు శ్రీనిధి కింద రుణం తీసుకున్నా. ప్రతిరోజు బీడీ కూలి పని చేస్తూ వాటిని క్రమం తప్పకుండా కట్టుకుంటు వచ్చాను. ఇప్పుడు ఐకేపీ అధికారులు మేము కట్టలేదని, ఇప్పుడు వడ్డీతో సహా కట్టాలని మాపై వత్తిడి తీసుకొస్తున్నారు. – బుదరపు మనెమ్మ, ధన్వాడ

రెగ్యులర్‌గా కట్టాను..

శ్రీనిధి నుంచి తీసుకున్న రుణం ప్రతి నెల బ్యాంకులో కడుతున్న సమయంలో ఐకేపీ అధికారులు వీఓఏతో కట్టాలని చెప్పారు. మధ్యలో కరోనా రావడంతో ప్రతినెల వీఓఏకు డబ్బులిచ్చి రశీదు తీసుకున్నాం. ఆ రశీదులు పనిచేయవు, డబ్బు కట్టాలంటున్నారు. వీఓఏ కట్టకపోతే మేమే వడ్డీతో సహా కట్టాలని చెబుతున్నారు. పై అధికారి దగ్గరకు వెళ్తామంటే నోటీసులు ఇవ్వడం లేదు. చేసేది లేక పొదుపు డబ్బు తీసి అప్పు కట్టి సంఘం రద్దు చేయాలని తీర్మానం చేసుకున్నాం. – గాయత్రి, ధన్వాడ



డబ్బులు తిరిగి చెల్లించాం..

శ్రీనిధి డబ్బును మేము తీసుకోలేదు. వచ్చిన డబ్బులు తీసుకోకపోయినా వడ్డీతో కలిపి తిరిగి చెల్లించాలని వత్తిడి చేస్తున్నారు. ఇప్పుడు డబ్బులు కట్టకపోతే ఇల్లు తాళం వేస్తామని ఇంటికొచ్చి భయపెడుతున్నారు. – కమలమ్మ, కిష్టాపూర్

చర్యలు తీసుకుంటాం..

ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదు. ఏపీఎం దగ్గర వివరాలు సేకరిస్తాను. తదుపరి చర్యలు తీసుకుంటాం. – మొగులప్ప, డీఆర్‌డీఓ

పదోన్నతి మరింత బాధ్యత పెంచుతుంది

- ఎస్పీ యోగేష్‌గౌతమ్

నారాయణపేట: పోలీస్ శాఖలో పదోన్నతి ఉత్సాహంతో పాటు మరింత బాధ్యత పెంచుతుందని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. సోమవారం జిల్లాలో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, సురేందర్‌గౌడ్‌లు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ వారికి హెడ్ కానిస్టేబుల్ పట్టీలను తొడిగి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ మరింత ఉత్సాహంగా పనిచేస్తూ, ప్రజలకు మంచి సేవలు అందించాలన్నారు.



పదోన్నతి పొందిన సురేందర్‌గౌడ్‌కు హెచ్‌సీ పట్టీలను తొడిగిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

గురుకులలో మధ్యాహ్న భోజనం పరిశీలన



మరికల్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం తహసీల్దార్ అనిల్‌కుమార్, ఆర్‌ఐ సుధాకర్‌రెడ్డిలు మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థుల భోజనానికి సంబంధించిన మెనూ వివరాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఘనంగా వసంత పంచమి



చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేస్తున్న పురోహితులు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా కేంద్రంలోని స్థానిక శిశుమందిర్ విద్యామందిర్‌లో మాఘ శుద్ధ వసంత పంచమిని పురస్కరించుకొని చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భారతమాత, సరస్వతి మాతల చిత్రపటాలకు పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు దత్తు చౌదరి మాట్లాడుతూ పాఠశాల ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో అక్షరాభ్యాసం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో కలిపి మొత్తం 123 మంది చిన్నారులు అక్షరభ్యాసంలో పాల్గొనట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు రతంగ్ పాండ్‌రెడ్డి, విద్యాపీఠం జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్, విద్వత్ పరిషత్ కన్వీనర్ లక్ష్మయ్యగౌడ్ పాల్గొన్నారు.

- ధన్వాడ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో, శ్రీసాయి సరస్వతీ విద్యామందిర్ పాఠశాలలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సరస్వతీ దేవి చిత్రపటానికి పూజలు చేసి సామూహిక అక్షరాభ్యాసం చేయించారు.
- నారాయణపేట మండలంలోని బైరంకొండ, జలాల్‌పూర్, షేర్నపల్లి, అమీన్‌పూర్ గ్రామాల్లో సరస్వతీమాత చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.



షేర్నపల్లిలో సామూహిక అక్షరాభ్యాసం

ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ధన్వాడ: మండలంలోని మాంత్రోనిపల్లి శివాలయం దగ్గర ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం వినాయకుడి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. పూజల అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పూజారి వెంకటస్వామి, లక్ష్మయ్య, కిష్టప్ప, తిమ్మయ్య తదితరులు ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

కోస్గి రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ బాల్‌రాజ్ అన్నారు. సోమవారం పట్టణంలోని శివాజీ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం తాగిన కేసులు పునరావృతం అయితే వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

వేసవి శిబిరం కరపత్రాలు విడుదల

నారాయణపేట రూరల్: వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శృతిలయ కల్చరల్ అకాడమీ ద్వారా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాల కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. సీవీఆర్ భవన్‌లో మాజీ డీసీసీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి కార్యక్రమం నిర్వహించారు. ఏప్రిల్ 25 నుంచి మే 25 వరకు, నారాయణపేట జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు శిక్షణతో పాటు సర్టిఫికేట్ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి బాలకృష్ణ, నారాయణపేట జిల్లా ఇన్‌చార్జి పవన్ కల్యాణ్, మండల ఇన్‌చార్జీలు అంజలి, శిరీష, భీమేష్ పాల్గొన్నారు.

రగ్బీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కోస్గి రూరల్: 7వ తెలంగాణ రాష్ట్ర స్థాయి రగ్బీ జూనియర్ టోర్నమెంట్ పోటీలలో నారాయణపేట జిల్లా తృతీయ స్థానం కైవసం చేసుకుందని ఉమ్మడి జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షులు జగన్‌మోహన్‌గౌడ్ ప్రధాన కార్యదర్శి నిరంజన్‌రావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 2, 3 తేదీలలో రాష్ట్ర స్థాయి రగ్బీ జూనియర్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో నారాయణపేట జిల్లాకు తృతీయ బహుమతి రావటంపై హర్షం వ్యక్తం చేశారు. గెలుపొందిన విద్యార్థులకు జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ, నారాయణపేట జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు రామకృష్ణ, కోచ్ సత్యం అభినందించారు.

ఘనంగా 'బీరప్ప' బండారు

ఊట్కూరు: మండల కేంద్రంలో బీరప్ప ఉత్సవాల్లో బాగంగా సోమవారం భక్తిశ్రద్ధలతో బండారు చల్లే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ శివారులోని బీరప్ప దేవాలయం దగ్గర ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేలాదిమంది భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బండారు పసుపు చల్లుకున్నారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి బీరప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ప్రశాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు రాజుల ఆశిరెడ్డి, నర్సింహగౌడ్, మాజీ సర్పంచ్‌లు సూర్యప్రకాష్‌రెడ్డి, భాస్కర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఊట్కూరులో బీరప్ప ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

కనులపండువగా బీరప్పస్వామి విగ్రహప్రతిష్ఠ



మాధ్వార్‌లో బీరప్పస్వామి ఆలయం ఎదుట ధ్వజస్తంభం ప్రతిష్టిస్తున్న భక్తులు

మరికల్: మండలంలోని మాధ్వార్‌లో కనులపండువగా బీరప్పస్వామి, ఎల్లమ్మ, ధ్వజస్తంభం, దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయంలో మూడు రోజుల పాటు పూజల అనంతరం సోమవారం నంది, సుబ్రహ్మణ్యస్వామి, బీరప్ప, రేణుక ఎల్లమ్మ విగ్రహాలతో పాటు ధ్వజస్తంభం విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు తీర్థప్రసాదలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొల్లూర్‌లో..

ఊట్కూరు: మండలంలోని కొల్లూరులో నూతనంగా నిర్మించిన బీరలింగేశ్వరస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా వేదపండితులు స్వామివారికి జలదివాసం, ధాన్య నివాసం, హోమం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి బీరలింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, నాయకులు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, రాజుల ఆశిరెడ్డి, నారాయణరెడ్డి, నర్సింహగౌడ్, సూర్యప్రకాష్‌రెడ్డి, సమృద్ధి, పాల్గొన్నారు.

నిధులు తేవడంలో విఫలం

ధన్వాడ: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్.రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ధన్వాడలో ఆయన కార్యకర్తలతో సమావేశం అయ్యారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలైనా రైతు బంధు, రుణమాఫీ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని, ప్రజలను మోసం చేస్తూ ఆరు గ్యారంటీలతో గారడీ చేస్తున్నారని ఆరోపించారు. వరి ధాన్యానికి బోనస్ ఇస్తామని చెప్పి రెండు నెలలైనా వారి ఖాతాల్లో బోనస్ ఇవ్వకుండా చేతులెత్తేసిందని అన్నారు. నారాయణపేటకు రూ.6 కోట్లతో తాను అతిథిగృహం మంజూరు చేస్తే దానిని అధికార పార్టీ నాయకులు కొడంగల్‌కు తరలించినా ఎమ్మెల్యే నోరు మెదపడం లేదన్నారు. గతంలో మంజూరు చేయించిన మెడికల్ కళాశాలను కూడా ఇంతవరకు ప్రారంభించలేని స్థితిలో పాలకులు ఉన్నారని అన్నారు. నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకం పాలకులు ఒండ్రు మట్టి వ్యాపారం చేయడానికి ఉపయోగపడుతుంది తప్ప ధన్వాడ మండలానికి చుక్క నీరు రాదని ఆరోపించారు. ఇక మహబూబ్‌నగర్ నుంచి బీజేపీ ఎంపీ లేకపోవడం వల్లే నిధులు రాలేదని గతంలో బీజేపీ వారు ప్రచారం చేశారని, ఇప్పుడు రైల్వే లైన్లు, సైనిక్ పాఠశాల అభివృద్ధికి నిధులు ఎందుకు తీసుకురాలేకపోయారని ప్రశ్నించారు. కార్యక్రమంలో వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, సుధీర్‌కుమార్‌రావు, చంద్రశేఖర్, మల్లేష్‌గౌడ్, సునిల్‌కుమార్‌రెడ్డి, మాధవరెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

ఉచిత కంటి వైద్య శిబిరం

మక్తల్: మక్తల్ పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బీమా అధ్యక్షుడు డీవీ చారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం సోమవారం నిర్వహించారు. కడుమూరు శ్రీనివాసులు సహకారంతో 60 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో కంటి ఆపరేషన్ కోసం 30 మందిని కందూర్ రాంరెడ్డి కంటి ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డీవీ చారి, అంజన్ ప్రసాద్ పృథ్వీరాజ్, ప్రమోద్, వెంకటేష్, అనుగొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.



మక్తల్‌లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలి

కృష్ణా: సమాజంలోని ప్రతి ఒక్కరు తమ ఇంట్లో ఉన్న తల్లిదండ్రులను, ఆ తరువాత గురువులను గౌరవించాలని నేరడగం పీఠాధిపతి శ్రీ పంచమ సిద్ధలింగ మహాస్వామి తెలిపారు. సోమవారం మండలంలోని, ముడుమాల్, గుడెబల్లూర్ గ్రామాల్లో తమ మఠం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వివరాలను ప్రజలకు తెలిపారు. మార్చి 16, 17, 18 తేదీల్లో మఠంలో నిర్వహించే ముత్తైదువులకు ఒడినింపే కార్యక్రమం, అనాథాశ్రమం ప్రారంభోత్సవం, గోశాల ప్రారంభం, రక్తదాన శిబిరం, ఉచిత సామూహిక వివాహాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ శివమాలధారులు, గ్రామ యువకులు, అర్చకులు పాల్గొన్నారు.



ముడుమాల్‌లో మాట్లాడుతున్న పంచమ సిద్ధలింగ మహాస్వామి

భూసేకరణకు నోటిఫికేషన్ విడుదల



కోస్గి రూరల్: రోడ్డు వెడల్పు పనుల నిమిత్తం భూసేకరణను కోసం నోటిఫికేషన్ విడుదల చేశామని మున్సిపల్ కమిషనర్ నాగరాజు తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఫాం నంబర్– సీ నోటీస్ బోర్డుపై అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సయ్యద్‌పహడ్ దర్గా నుంచి రామాలయం చౌరస్తా వరకు రోడ్డు వెడల్పు పనులకు కోసం భవనాలు, ఖాళీ స్థలాలు కోల్పోతున్న 228 మంది బాధితుల నుంచి భూసేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. అభ్యంతరాలను 60 రోజుల్లోగా తెలియజేయాలని, అనంతరం ప్రభుత్వం బాధితులకు నష్టపరిహారం అందిస్తుందన్నారు. మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

నేడు భీమరాయుడి జాతర

దామరగిద్ద: రథసప్తమి పర్వదినం సందర్భంగా మంగళవారం మండల సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం మోతకపల్లిలో భలభీమరాయుడి జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకోవాలని, ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

నేడు గట్టు తిమ్మప్పస్వామి రథోత్సవం



మక్తల్: మండలంలోని మాద్వార్ నల్లకొండల్లో వెలిసిన నామాల స్వామి శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి(గట్టు తిమ్మప్ప బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని మక్తల్ మాజీ మార్కెట్ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు తెలిపారు. ఉదయం 11గంటలకు కల్యాణోత్సవం, సాయంత్రం 6గంటలకు స్వామివారి రథోత్సవం, 5న పాలఉట్లు, 6న గరుడవాహన సేవ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు సోలాపూర్, బొంబాయి, అంబర్‌నాథ్, హైదరాబాద్, గోవా, పూనా, బెంగళూర్, కర్ణాటక, వంటి పట్టణాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు.

కర్నిలో గుండు రంగస్వామి రథోత్సవం

మక్తల్ మండలం కర్ని గ్రామ సమీపంలో రెండు గుహల మధ్య గుండురంగస్వామి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 6గంటలకు రథోత్సవం, 5న పాల ఉట్లు, నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.